# పోస్టు చెయ్యని ప్రేమలేఖలు

—చెన్నూరి నాగరాజు

భర్తతో ఆ కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టాక మంజులకి ఎంతో ఆనందంగా వుంది. ఆ పట్టణంలో వూరికి దూరంగా వున్న కాలనీలో ఇల్లు అది. ఇంటి ముందు పందిరికి అల్లుకునివున్న బోగన్‌విల్లా పెరట్లో గులాబీ, కనకాంబరం చెట్లు ఎంతో ముచ్చటగా అనిపించినాయి. ఎలా వుంది: అని భర్త అడిగితే అతని గుండెలమీద తలవాల్చి కళ్లు మూసుకుని ఇంత బావుంది అంది అతనికి హత్తుకుపోయి. గర్వంగా కాలర్ సవరించుకున్నాడు. ఇంకా ఇంటికి చేయబోయే మార్పులు చెప్పాడు. బాంబే డైయింగ్ కర్టెన్లు ఎంత బావుంటాయో చెప్తుంటే కళ్లు విప్పార్చి వింటుంది అతడి మాటల్ని. వాళ్ళకి పెళ్ళయి నెలరోజులవుతుంది. అతనికి వెనకా ముందు ఎవరూ లేరు. వున్న వూళ్ళోనే ఉద్యోగం. ఉద్యోగం వచ్చాక పెళ్ళి కుదిరే ముందు ఈ యిల్లు తీసుకున్నాడు. తన భార్య అభిరుచులకి తగ్గట్లు అలంకరించే ప్రయత్నాలు చేస్తునే వున్నాడు. పుట్టింటినుంచి భర్తతో వస్తుంటే అమ్మా, నాన్నలని, అక్కయ్యని, అన్నయ్యని, తమ్ముణ్ని, చెల్లెల్ని, పెరట్లోని పూలచెట్లని వదిలి రావాలంటే బాధగానే అనిపించినా మొగుడి వెంట కొత్త కాపురానికి బయలేరడం మంజులకి ఎంతో థ్రిల్‌గా వుంది. ఇంట్లోకి వచ్చిన రోజు ఆఫీసుకి సెలవు పెట్టాడు. షాపింగ్‌కి వెళ్ళారు. హోటల్లోనే భోంచేసి సినిమాకెళ్ళారు. సినిమాకెళ్ళి వచ్చాక డాబామీద పక్క వేసుకుని వెన్నెలరాత్రి గడపాలన్న కోరిక వున్నా ఆ ఇంటికి డాబా లేకపోవడంవల్ల ఆ దంపతుల కోరిక తీరలేదు.


[illegible] రోజూ భర్త ఆఫీసుకెళ్ళేవరకూ పని. ఆ తరువాత అతని ఊహల్తో మధ్యాహ్నం వరకు గడిపేసి అతనొచ్చే వేళకి ఇష్టమైన టిఫిన్ తయారుచేసి వుంచినా టిఫిన్‌కన్నా తనని దగ్గరగా తీసుకుని ముద్దు పెట్టుగోవడమే అతని కిష్టం. ఆ వేళ అతనాఫీసు కెళ్ళాక ఇల్లు అందంగా సర్దాలనిపించి ఆ కార్యక్రమం మొదలెటింది. చాకలి తెచ్చిన ఇస్త్రీ బట్టల్ని సూట్‌కేస్‌లో సర్దింది. సూట్ కేస్ సర్దుతుంటే ఓ ఫైల్లోంచి కాగితాలు జారాయి. ఆ కాగితాలకి వున్న సెంటువాసన మత్తుగా వుంది. ఆశ్చర్యంగా కాగితాల్ని అందుకుంది. మడత నలగని కాగితాలు. వరుసగా కాగితాల వెంట ఆమె చూపులు పరిగెడుతున్నాయి.

4-2-79

డియర్....

చాలా రోజులనుంచీ నీతో మాట్లాడాలని ప్రయత్నం. పెరట్లో గులాబీ తెంపుకుని జడలో తురుముకుంటూ వుంటే నా గది కిటికీలోంచి నిన్ను చూశాను. నిన్న దండెంమీద ఆరేసి వున్న వైలెట్ చీర ఈ రోజు నీ శరీరాన్ని అతుక్కుపోయేసరికి ఆ చీరకి ఎంత అందం వచ్చిందని! వైలెట్ నైలెక్స్ చీర, తెల్ల జాకెట్టు తలంటుకుని నువు జుట్టు అరబెట్టుకుంటూ వుంటే అలా ఎంతసేపైనా చూడగలను. కానీ కాలేజీకి టైమవుతోంది. నిన్ను అంతగా చూస్తున్నా నువ్వు కళ్ళయినా కలపవు కదా! నీ చూపుకోసం, నీ పలకరింపుకోసం ఎంత తహతహలాడుతున్నానో....నా గుండె మీద చెవి వుంచి వింటే తెలుస్తుంది. ప్చ్! ఎప్పుడు ఈ దీనుణ్ని కరుణిస్తావో....






ప్రియా! 7-2-79

నువ్వు మాట్లాడవు, పోనీ నీతో మాట్లాడాలన్నా వీలుకాదు. ఒకవేళ ఎలాగో నువ్వు వీధిలో నుంచున్నప్పుడో, బజారుకి వెళ్ళినపుడో మాట్లాడితే ఏ రోమియోలాగానో భావించి నాపై దురభిప్రాయం ఏర్పరచుకుంటే .... నువ్వు మాట్లాడుకున్నా పరవాలేదు కానీ నీ తిరస్కారాన్ని భరించే శక్తి ఈ గుండెకి లేదు. పోనీ వుత్తరాలైనా వ్రాద్దామంటే అది వీలుకాదు. పోస్టులో నీకు పంపిస్తే మీ వాళ్ళెవరయినా అది

## ఏది వెలుగు?

వీధిలాంతరు క్రింద
వేశ్యను చూసి...
ఒకడన్నాడు
వీధిలాంతరు చీకటి,
వేశ్య వెలుగని!
కానీ, వాడికేం తెలుసు...
వీధిలాంతరు చీకటిని కాల్చుతుంది
వేశ్య వెలుగులో కాలుతుంది!

—ఈశ్వర్

అందుకుంటే....ఏ రాయికో చుట్టి నువ్వు పెరట్లో వున్నప్పుడు కిటికీలోంచి విసిరేస్తే.... ఏమో భయం....ఈ ఆరాధన, ఈ ప్రేమ నీకు చెప్పుకోగల అవకాశం ఎప్పుడొస్తుందో....

11-2-79

నీకు....

నా అణువు అణువులో నువ్వే నిండివున్న నీకు ఏం ఇవ్వగలను నన్నుతప్ప. నా మనస్సెప్పుడో నీ వశం అయింది. నేనిలాగా బ్రతికి వున్నానూ అంటే ఎప్పుడో ఒకప్పుడు నీ చల్లనిచూపు, మెత్తని నవ్వు, ఈ గుండెకి తాకుతుందన్న ఆశతోనే. నేను కాలేజీకి వెళ్ళేముందు నువ్వు కూరలమ్మేవాడ్ని పిలవటానికి వీధిలోకి వచ్చావు. ఎలా పిలవాలా అని నువు చూస్తుంటే నేనా కూరలవాణ్ని పిలిచినపుడు నావైపు చూశావొక క్షణం. అలా చూస్తూ నువ్వు ఏమనుకున్నావో నాకు తెలియదు కానీ—నాకెన్నో అర్థాలు స్ఫురించాయి ఆ చూపులో. నీతో మాట్లాడాలి, నన్ను పెళ్ళి చేసుకుంటావా అని అడగాలి! ఏమంటావ్? నీకోసం ఏమేమో చెయ్యాలి. నువ్వు నడిచే దారిలో మల్లెలు పరవాలి. నీ కాలు కందిపోయినా నా మనస్సుకి గాయం అవుతోంది. రెండు నెలల్లో నా చదువు పూర్తవుతోంది. ఉద్యోగం వస్తుంది. సాయంత్రం కాలేజీనుంచి వస్తుంటే బాంబే డైయింగ్ షాపు ముందు ఓ క్షణం ఆగాను. అక్కడి షోరూమ్‌లో ఓ బొమ్మకి చీర కట్టారు. గులాబీ రంగు పట్టుచీర. జరీ పూలున్నాయి. ఆ బొమ్మకి చీర ఏమీ నప్పలేద్దు. ఆ చీరలో నిన్ను వూహించుకున్నాను. నాకు ఉద్యోగం రాగానే నీకు ఆ చీర కొంటాను. ఇస్తే వద్దనవుగా....నిద్ర రావడంలేదు. రోజూ ఎన్నో గంటలు కనిపిస్తూనే వుంటావు. మాట్లాడవు. కలలో మాత్రం కనిపిస్తావు, నవ్విస్తావు, ఎందుకలా ఏడ్పిస్తావ్?

16-2-79

నా ప్రాణానికి....

కాలేజి నుంచి ఇంటికి వస్తుంటే నా ముందు కొద్ది దూరంలో నడుస్తున్నావు. ఎంతమందిలో వున్నా నిన్ను నేను గుర్తుపట్టగలను. నీ నడక, నీ చూపు, నీ నవ్వు అన్నీ నా హృదయమనే కెమెరాలో ఏనాడో బంధించాను. నాకు అందనిది నీ మనస్సొకటే! ఇంట్లోకి వెళ్తుంటే కర్చీఫ్ నీ చేతిలోంచి జారిపోయింది. నువ్వు చూడకుండానే వెళ్ళిపోయావు, అది అందుకుంటూ వుంటే ఎవరైనా చూస్తున్నారేమో అని గుండె గుబగుబలాడింది. కర్చీఫ్! నీ పెదాలనీ, నీ మొహాన్ని తాకిన కర్చీఫ్ నా చేతిలో వుంది. నువ్వే నా చేతిలో వున్నట్లనిపించింది. కర్చీఫ్‌ని ఎన్నోమార్లు ముద్దెట్టుకున్నాను. ఓ గంట తర్వాత నువ్వు గుమ్మంలో నుంచున్నావ్. ఎలాగైనా మాట్లాడాలని 'కర్చీఫ్ మీదా' అన్నాను. ఓ అడుగు ముందుకేసి 'థేంక్స్' అని అందుకున్నావు. కర్చీఫ్ నాకెలా దొరికిందని అడుగుతావని అనుకున్నాను. అడగలేదు. నేనలా నిన్ను చూస్తుండగానే లోపలికెళ్ళావు.


25-2-79

సఖీ,

ఈ వారంరోజులు ఎక్కడికెళ్ళావ్? ప్రతిరోజు పెరట్లో కనిపిస్తావేమోనని కిటికీ దగ్గర పడిగాపులుపడ్డాను. వారంచేసి పనిమనిషినడిగితే








మీ బంధువుల పెళ్ళికి వెళ్ళావని చెప్పింది. నువ్వు కనిపించని ఈ వారంరోజులు ఎన్నో యుగాలయినట్లు అనిపిస్తూంది. నువ్వు కనిపించగానే పునర్జన్మ వచ్చినట్లనిపించింది. ఏం వ్రాయను మనస్సంతా నీదే! నా ఆలోచనల నిండా నువ్వే!

2-3-79

స్వీట్ హార్ట్,

ఈ వేళ మీ యింటికి కార్లో వచ్చారెవరో. మీవాళ్ళు చాలా హడావుడిగా కనిపించారు. నువ్వు పెరట్లోకి వచ్చినపుడు చూశాను. ప్రత్యేకంగా అలంకరించుకున్నావు. పనిమనిషిని పిలిచి అడిగాను. పెళ్ళిచూపులని చెప్పింది. నా గుండెని కోసినట్లే అనిపించింది. ఇన్నాళ్ళూ నీతో ఈ విషయం మాట్లాడక పోవడం నా అవివేకం కాదూ! నువ్వు లేనిది నేను బ్రతగ్గలనా? పెళ్ళి చూపుల తతంగం ఏముంటుంది. అప్పుడే చెప్తాడు నువ్వు నచ్చావని, నువ్వు నచ్చలేదన్న వాళ్ళు గుడ్డివాళ్ళే అయి వుంటారు. నువ్వునాకు లేవన్న ఊహే భరించలేకపోతున్నాను.

10-3-79

సీత,

మళ్ళీ ... పేరుతో సంబంధం కుదరలేదని డబ్బుతో సాధు

పనిమనిషే చెప్పింది. ఎంత సంతోషమేసిందని! ఇక ఆలస్యం చేస్తే నువ్వు నాకు దూరం అవుతావు. ఈవేళ నిన్ను అడగాలనుకున్నాను. బజారుకు వెళ్ళేప్పుడు వెంట వద్దామని అనుకున్నాను. వెంట మీ తమ్ముడున్నాడు. నిన్ను ఇంతగా ఆరాధిస్తున్న నేను నిన్ను ప్రేమిస్తున్నాను అంటే ఏమంటావో! ప్రేమ అంటే ఇంత తక్కువ వ్యవధిలో ఎలా కలిగింది అంటే ఏం చెప్పగలను. నిన్ను చూసిన క్షణంనుంచీ నాలో కలిగిన స్పందన చెప్పే భావుకత నాకు లేదు. నువ్వు నా క్కావాలి. నీతోడు కావాలి....

ఆఫీస్ ఫైల్ మరిచిపోయి అది తీసుకెళ్ళడానికి వచ్చిన స్వరూప్ అడుగులు విని తలెత్తింది మంజుల. మంజుల చేతిలో కాగితాలు. ఓ క్షణం చేతిలో కాగితాలనీ, భర్తనీ చూసింది. ఆ కాగితాలని అలాగే వదిలేసి ఒక్క ఉదుటున అతణ్ని చేరుకుని పెనవేసుకుంది. ఆమె భుజాల చుట్టూ చేతులు వేశాడు. "నన్నింతగా ప్రేమించావా" ఆమె పెదాలనుంచి మాటలు రావడం లేదు. ఆమె గుండె చప్పుడు అతని హృదయంతో ఈ మాట అంటూ వుండడం వినిపించింది. □